ప్రచురణకు స్వీకరించిన పోటీకథానిక :

# వంచన

అల్లంతదూరాన కబుర్లు చెప్పుకుంటూ నడిచి వొస్తున్న అమృతరావునూ, శారదనూ చూసి కేకవేశాడు రఘు. వాళ్ళకది వినపడింది. పక్కన కూచుని గడ్డిపరకలు తుంపుతూన్న రాధ "ఇహ మీకు కావలిసినంత సందడి" అన్నది. రఘు నవ్వాడు. "అతవాళ్ళకి కథలంటే అమిత మక్కువంటారు. నా కథలంటే యిష్టపడతావుకూడా. కాని అతనూ నేనూ కథల్ని గురించి మాటాడుకోవడం అంటే అంత దూరంగా వుంటావెందుకు రాధా ?" అన్నాడు. "బోరు కొడుతుంది గనక" అన్నది రాధ ముక్తసరిగా. అది పూర్తిగా నిజం కాదనుకున్నాడు రఘు. అమృతరావు స్వయానా రాధ మేనమామ కొడుకు. కొద్దికాలంలోనే మంచి రచయిత అని పేరుతెచ్చుకున్నాడు కూడాను. తనకు అంత పేరు కదూ చాలాకాలంనుంచీ రాస్తున్నా. అందుచేత అతనిమీద అసూయేమో రాధకి అని అతని అనుమానం అయితే అతనేనాడు ఆ అనుమానం బయటికి వెలిబుచ్చదలుచుకోలేదు. అందువల్ల ఫలితం వేదనాకరంగా వుండవొచ్చనీ భయం అందుకు కారణం. ప్రస్తుతంలోకూడా అతను భార్య అన్నమాటలకు అలవోకగానవ్వేసి వొచ్చికూచున్న అమృతరావుతో "నమస్కారం కవిగారూ !" అన్నాడు. "భార్యాభర్తలిద్దరూ ఏదో చర్చించుకుంటున్నారు లావుందే?" అన్నాడు అమృతరావు చిరునవ్వుతో. "అంత గంభీరమయిన చర్చేమీ కాదులెండి. అవునుగాని "రాగిణి"కి కథ పంపానని చెప్పారు కారేం ?" అన్నాడు రఘు అమృతరావు శారదవంక చూసి "ఆ పాపమో పుణ్యమో ఆమెగారిది. నాది కాదు" అన్నాడు మందహాసంతో. "అంటే ?" అన్నాడు రఘు అర్థంకాక. ఏమీలేదు అకథ రాసి జాగ్రత్తగా డ్రాయర్లో దాచుకుని ఎవరికీ పంపను. పడదు అని కూచున్నారు. నేనే ఆయనకి తెలీకుండా పంపించాను." అన్నది శారద. రాధకి సంభాషణ విసుగెత్తించింది ఇహ అంతాకలిసి కథల్నిగురించీ కాకరకాయల్ని గురించీ వాదులాడుకోవడం మొదలెడతారు. అందుకని చివాల్నలేచి శారద చెయ్యి పుచ్చుకుని "అలా తిరుగొద్దాం రావోయ్!" అంటూ ఆమెనుకూడా తీసుకుని వెళ్ళిపోయింది వాళ్లిద్దరూ కాస్త దూరమయ్యాక రఘు జేబులోంచి సిగరెట్ పెట్టె తీసి తనొకటి ఎలిగించుకుని అమృతరావుకొకటి యిచ్చాడు. అతనూ వెలిగించుకున్నాక "అకథ చాలాబావుంది అమృతరావుగారూ ! కంగ్రాట్యులేషన్స్" అన్నాడు. "థాంక్స్" అన్నాడు అమృతరావు.

"ఎలావుంది మీ ఆఫీసువర్కు ?. అన్నాడు రఘు తిరిగి.

"బాగానేవుంది. మీకు తెలిందేవుంది ? మామూలు రోజుల్లోనే నాకు పని చాలా తక్కువ. ఇప్పుడు సజనకూడా కాదాయె. బద్ధకంగా కూచునివుంటున్నాను ఆఫీసులో"

"అదృష్టవంతులు మాకు అరింటిదాకా పని చేసినా ఎరియర్సు వుంటూనే వుంటాయి"

"అమధ్య డిపార్టుమెంటు మార్చించుకుంటానన్నారుగా ? ఏమయింది ?"

"మా మేనేజరు సైంధవుడిలా అడ్డుకున్నాడు. ఆయనగారి శ్యాలకుడెవడో వున్నాడు. వాడికి వేయించాడు."

## 'హ వి స్'

"అవునుమరి ! తనకు మాలిన ధర్మం వుంటుందా ?"

"పైగా యీ మధ్య ఆయనగారు నా మీద విపరీతంగా మండిపడుతున్నాడు. పికిక్స్‌లో శ్రీవారు కొంత గోల్‌మాల్ చేశాడు. అది ఆయన ఖర్మో, నా కర్మోకాలి నా చేతి కొచ్చింది రిపరెన్సుకోసం నిజం బయటపెట్టేసరికి రుద్రుడయిపోయాడు."

"ఇందులో ఆయన మిమ్మల్ని చెయ్యగలిగిందేవుంది?"

"అయ్యోబాబూ! ఆయనగారికి పెద్ద పెద్ద వాళ్ల ప్రాపకం వుంది. కావాలనుకుంటే ఈనాడు నన్ను భర్తరఫుచేయించగలడు."

"మరి - ఏంచేద్దామనుకుంటున్నారు ?"

"సాధ్యమయినంత త్వరలో ఈ ఆఫీసునుంచి విరగడయి మరోదాంట్లో జేరదామనుకుంటున్నాను. 'రాజారాం'లో ఎకౌంటెంటు కావాలన్నారు. అప్లికేషను పడేశాను"

"శేషయిన పనిచేశారు."

అంతవరకూ బాగానేవుంది. కాని ఆ ఉద్యోగం మనకేయిస్తారని గ్యారంటీ ఏవుంది ? మనకన్నా పెద్దదిగ్రీలున్నవాళ్లూ, బంధువుల తాలూకువాళ్లూ ఎందరయినా వుంటారుకదా ?"

"మీకు ఎవరయినా సిఫార్సు చేసేవాళ్లుంటే చూడండి"

"అదే అనబోతున్నాను. రాజారాంగారికి మన నాయుడుగారంటే ఎంతో గురగౌరవమూట. ఆయనచెబితే ఉద్యోగం రావటంఖాయం"

"అయితే యింకేం ? వెళ్లిఅడగండి"

రఘు నవ్వాడు "అది అంతతేలికంటారా ? బంధుత్వంవున్నా, రాకపోకలు జరుగుతూన్నా, అయనకూ మానాన్నగారికీ అంతర్గతంగాస్పర్ధలున్న విషయం మీకు తెలిసిందేగదా ? పైగా ఆయనను స్వయంగా తోచాలేగాని నాబోటివాడు చెబితే వినిపించుకోడు. అయనకి అభిమానపాత్రులయినవారెవరన్నా చెబితే పని జరుగుతుంది"

"శారద ఆయన కూతురేగా ? చెప్పించండి"

"అదీ అంత లాయకగా కనబడటంలేదు... ఎందుకు చెప్పకపోవాలి? మీరంటె అయనకి ప్రాణం. మీరుచెబితే ఆయన తప్పకుండా వింటాడు"

"బలేవారు ! అయన ఆదరాభిమానాలవల్ల బతుకుతున్నవాడిని. నేను ఆయనకు సలహాలివ్వగలవా ? పొకవేళ యిచ్చినా ఆయన వింటాడా ?"

"అనే నావిశ్వాసం"

"మీరుచాలా అమాయకులు రఘుగారూ ? అంతటి గొప్పవాడ్ని కాదునేను. ఇంతవరకూ ఆయన ఎలా చెబితే అలా నడుచుకున్నవాడ్ని. అందువల్ల నాకన్నా శారదచేత చెప్పించడమే మేలు"

"అంతేనంటారా ?" అన్నాడు రఘు నిట్టూర్చి.

"నేను తప్పించుకోవటానికి అలా అంటున్నాననుకోకండి వీలుపడితే, అవకాశందొరికితే నేనూ ఆమాత్రం మాట సహాయం తప్పకుండా చేస్తాను. మీరు రాధచేత శారదకు చెప్పించండి. ఆమెమీద అంతులేని అపేక్ష ఆయనకి, ఆమె మాట తప్పకుండా వింటాడు"

"ఇహ అంతే చేయాలి"

ఇద్దరూ కొంతసేపు మౌనంగా కూచున్నారు. చీకటిపడుతోంది. పార్కులో జనమంతా మెల్లిగా లేచి బయలుదేరుతున్నారు యిళ్లకి. తూర్పున ఎర్రగా చంద్రోదయం అవుతోంది. గూళ్లకు జేరుకుంటున్న పక్షులు రొదచేస్తున్నాయి. అమృతరావు తిరిగివొస్తున్న రాధనూ శారదనూచూసి, రఘుతో "వాళ్ళు వొస్తున్నారు. ఇహ లేద్దామా ?" అన్నాడు. "పదండి" అన్నాడు రఘులేచి. శారదా రాధా మౌనంగా వొచ్చి వాళ్ళతో కలిశారు. నలుగురూ నిశ్శబ్దంగా నడుచుకుంటూ పార్కు వెలుపలకి వొచ్చారు.

ఆదివారం కావటాన రోడ్డుమీద జనసంచారం అట్టేలేదు. పార్కు కెదురుగా వున్న 'రెస్టారెంటు' లోంచి ఏదో హిందీపాట వినిపిస్తోంది. నలుగురూ ఆగారు. రఘు రిక్షా కేకేశాడు. కిరాయి మాట్లాడుకుని "వెళ్ళొస్తాం అమృతరావుగారూ" అన్నాడు రఘు. అమృతరావు చేతులు జోడించాడు. రాధ శారదతో వెళ్ళొస్తానని చెప్పి రిక్షా ఎక్కింది. రిక్షా కదిలాక అమృతరావూ, శారదా మెల్లిగా నడుస్తూ బయలుదేరారు. కొంతదూరం వచ్చాక "రఘు మీతో ఏమన్నా చెప్పారా?" అన్నది శారద మందస్వరంతో. అమృతరావు జరిగిందంతా చెప్పాడు. "రాధ నన్ను రికమెండ్ చేయమన్నది" అన్నది శారద. "చెయ్యి" అన్నాడు అమృతరావు. "మీరు అప్పించుకుని నన్ను ఉసికొల్పుతున్నారా?" అన్నది శారద తీక్షణంగా. అమృతరావు నవ్వి "అలాంటివి నాకు తెలీవు" అన్నాడు. ఇద్దరూ మరికొంతదూరం నడిచారు. రోడ్డు మలుపుతిరగబోతూ కాస్త అవతలగా వున్న లీలాటాకీస్‌వైపు చూసి "డెవిల్స్ డిసైపుల్' యివాళ్టితో ఆఖరుకదూ? సెకండ్ షోకి పోదామా?" అన్నది శారద. "చూడక పోతే నష్టమా? అన్నాడు అమృతరావు" షా నాటకం గదా? మాకు వుందికూడాను" అన్నది శారద. "అయితే యిహ ఆలోచన దేనికి? పోదాం" అన్నాడు అమృతరావు నవ్వి. "నాన్నగారూ ఏమంటారో?" అన్నది శారద సందేహంగా. "చూద్దాం." అన్నాడు అమృతరావు ముందుకు అడుగువేస్తూ.

ఇద్దరూ ఇంటికొచ్చారు. స్నానాలు కానిచ్చి బట్టలు మార్చుకుని సుశీలాదేవి పిలవడంతో భోజనాలకొచ్చి కూర్చున్నారు. నాయుడుగారు రెండు ముద్దలు తిన్నాక "మీ హెడ్ ఎకౌంటెంట్ రిటైరవుతున్నాడన్నావు కదుటోయ్?" అన్నారు అమృతరావుతో. "ఊఁ" అన్నాడు అమృతరావు. "మీ మేనేజింగ్ డైరెక్టరుతో మాట్లాడినా?" అన్నారాయన తిరిగి. 'మీ యిష్టం' అన్నాడు అమృతరావు. 'అవున్లే! నీ కా వుద్యోగం వొస్తే వొచ్చేది నాకేగా?' అన్నారాయన కుహనా నిష్ఠూరంగా. అమృతరావు నవ్వి వూరుకున్నాడు. కొద్దిక్షణాలుపోయాక సెకండ్ షోకి పోదామనుకుంటున్నాం" అన్నాడు అమృతరావు ఆయనవంక కీగంట చూస్తూ. ఆయన ముఖంలో చిరాకు స్పష్టంగా గోచరించింది. 'ఈ చలిగాలిలోనా? అసలే మీ యిద్దరూ హెల్త్ మినిష్టర్లు' అన్నారాయన అయిష్టత ధ్వనిస్తూ. 'స్వెటర్ వేసుకుంటాంగా?' అన్నాడు అమృతరావు వెటకారాన్ని దాచుకుంటూ. ఆయన గట్టిగా ఏదో అనబోయి, నీకు అలాగేవుంటుంది. పెద్దవాళ్ళ మంటూ ఉన్నాంగనక మీకు ఏం వొచ్చినా అడుకుంటాం... ఆరోగ్యంకన్నా విలువయిన ఆస్తి లేదు మనిషికి. అదే పోగొట్టుకుంటే ఎందుకూ పనికిరాకుండా పోతారు. వయసులో వున్నారు గనక మీకిప్పుడు తెలీదు. అవయవాల పటుత్వం తప్పాక విచారించి లాభం వుండదు." అన్నారు హితబోధగా. 'ఒక్కరోజు సినిమాకి అర్ధరాత్రి వెళ్లినంత మాత్రాన ఆరోగ్యం చెడిపోతుందా?' అన్నాడు అమృతరావు. ఆయన నిట్టూర్చి 'ఇహ నీ యిష్టం' అన్నారు.

భోజనాలు ముగిశాయి. అమృతరావు తన గదిలోకి వొచ్చాడు. బల్లమీద వున్న టైంపీసు పావుతక్కువ ఎనిమిది చూపిస్తోంది. అతను కుర్చీలో కూచుని కాళ్లు బల్లమీదకి చాచి వెనక్కి చారగిలబడ్డాడు. నాయుడుగారు ఇందాక అన్న మాటలు అతని మనస్సులో వొకసారి రింగుమన్నాయి. అతని నరనరాలు చెలరేగాయి. ఆయనకు తనమీద అంతవాత్సల్యం అనురాగం అది ఎలా సంభవించిందీ అనే సంగతి అతను సకారణంగా ఊహించలేడు. దాదాపు ఏడాది క్రితం తాను డిగ్రీ క్లాసులో ఉత్తీర్ణుడయాడని తెలిసిన రోజున అంతవరకూ తల్లిలేని కొరత తీరుస్తూ తనను పెంచి పెద్దజేసిన తండ్రి శాశ్వతంగా తనకు దూరమయిపోయాడు. ఆయన బ్రతికున్నన్నాళ్లూ చేసింది గుమాస్తా వుద్యోగమే అయినా దర్జాగా చేతికి ఎముకలేకుండా బతికాడు. ఆయనవల్ల ఉపకారం పొందని అమాయకుడు ఆవూళ్లో లేడు. అయితేనేం? దమ్మిడీ మిగల్చలేకపోగా తాతతండ్రులిచ్చిపోయిన కాస్త ఆస్తీ హారతికర్పూరం చేశాడని బంధుగణం అంతా అసహ్యించుకుంది. ఆ కారణానే పుట్టగానే అమృతరావు భార్య అనుకున్న రాధను మరొకరికి దత్తం చేశాడు అతని మేనమామ. అందుకు అంతగా అతను బాధపడలేదు. రాధమీద అతనికి యిష్టం వున్నా తన వర్తమాన స్థితి తమ దాంపత్యాన్ని ఆనందప్రదం చేయలేదని తెలిసి ఆ ఆశలు తుంచివేసుకున్నాడు. ఆ తరువాత తండ్రిపోయి ఉన్న వొక్కయిల్లూ అప్పులోళ్లు స్వాధీనపరుచుకోవటంతో, మిగిలిన చిన్నా చితకా సామానూ అమ్ముకుని ఆ చాలీచాలని డబ్బులతో, ఎందుకూ కొరగాదనిపించిన డిగ్రీతో ఈ వూరు చేరుకున్నాడు. ఎన్నో రోజులు ఒక పూట భోజనం చేసి బాటపక్కన ఏచెట్టునీడనో దుప్పటి పరుచుకొని ఆ చలిలో వానలో రాత్రుళ్లు గడిపాడు. ఆ రోజుల్లోనే వొకసారి రాధ, ఆమె భర్త ఆ వూళ్లోనే వున్నారని తెలిసి వారియింటికి వెళ్లాడు. అక్కడ నాయుడుగారికి అతనికీ పరిచయం అయింది. తాను చెప్పాలని అనుకోకపోయినా రాధ ఆయనకు తన దీనస్థితిని వెల్లడిచేసింది. అందుకు కారణం ఏమయినా, నాయుడుగారు అది విని జాలిపడ్డారు. ఉద్యోగం యిప్పించి తన యింట్లోనే అట్టిపెట్టుకున్నారు. ఆనాటి నుంచి తన జీవితం సాఫీగా, నిమ్మకు నీరెత్తినట్లుగా సాగిపోతున్నది. ఆయనకు వొక్కగా నొక్క కూతురు శారద తన సారస్వతాభిరుచిని మొదటగా ఆయింట్లో పసిగట్టింది ఆమే. తనను కథలు రాయమని ప్రోత్సహించి కథకుడుగా రాణించి యింతటి స్థానాన్ని అందుకొనటానికి మూలకారణం ఆమే. నైరాశ్యం, నిస్పృహా ఆవరించుకున్న తన జీవితం ఈ గుమ్మం తొక్కగానే చంద్రకాంతితో విరిసి సహోత్సాహంతో వెల్లివిరిసింది. తల్లిదండ్రులు లేరే అన్న దుగ్ధ తప్ప తనకు నేడు ఏ లోటూ లేదు.

అశ్రుసిక్తాలయిన నయనాలను తువాలుతో అద్దుకున్నాడు అమృతరావు. ఎవరో వొస్తున్న అలికిడి అయి గుమ్మంవయిపు చూశాడు. వికసిత మొహంతో శారద లోపలికి వచ్చింది. ఆమె ముఖం చూడగానే నవ్వొచ్చిందతనికి. "సినిమాకు వొస్తారేంటి?" అన్నదామె కిటికీ గూట్లో కూచుని. "ఏం?" అన్నాడతను. "నాన్నగారు వొద్దన్నారుగా?" అన్నదామె. నవ్వాడు అమృతరావు. "వెళ్లమంటేనే?" అన్నాడతను. "అన లేదుగా?" అన్నదామె. "ఓగు.. పడకు అమ్మాయీమణి! ఆయన మాటలకు అర్ధంలేదు. మరో అరగంటలో బయలుదేరాం" అన్నాడతను [illegible]. ఆమె లేచి నిశ్శబ్దంగా వెళ్లిపోయింది. అమృతరావు తిరిగి నవ్వుకున్నాడు. ఆమె వెళ్లిపోయిన [illegible] నిముషాలకి నాయుడుగారు వొచ్చారు. అమృతరావు బల్లమీంచి కాళ్లు దింపేశాడు. ఆయన రెండో కుర్చీలో కూచుని "నిజంగా వెళ్లక తప్పదంటావా?" అన్నారు చిన్నపిల్లాడిలా. "శారదకు ఆ పుస్తకం వుందిట అందుకు" అన్నాడు అమృతరావు. "మరి జాగ్రత్తగా వెళ్లివొస్తారా?" అన్నారాయన. "ఆ" అన్నాడు అమృతరావు. "స్వెటర్ వేసుకొని మఫ్లర్ చుట్టుకొని మరీ వెళ్లండి" అని ఆయన మెల్లిగా లేచి లోపలికి వెళ్లిపోయారు. ఆయన ఏదో చెబుదామని వొచ్చి అది చెప్పకుండా లోపలకు వెళ్లిపోయినట్టు గ్రహించాడు అమృతరావు. 'ఆ' ఏమిటో 'ఆ' ఆలోచించడం పూర్తికాకముందే శారద అపర శారదలా అలంకరించుకుని వొచ్చి "పోదాం పదండి" అన్నది ఉత్సాహంగా. అమృతరావు లేచి చొక్కా పాంటు తొడుక్కుని ఆమెతోపాటు బయటికి వొచ్చాడు. గుమ్మం దాటుతూ "మీ నాన్నగారు చూడటంలేదుగదా? లేకపోతే పిలిచి స్వెటర్ వేసుకోమంటారు?" అన్నాడు కుహనా భయంతో. "పాపం ఎంత భయం? వేషాలు చాలుగాని పదండి" అన్నది శారద. ఇద్దరూ సినిమాహాలు చేరారు. ఇంటర్వెల్‌లో, తమ పై క్లాసు అటుయిటూలగా కూచునివున్న రాధనూ, రఘునూ చూసింది శారద. ఆమెకు అమృతరావుపై వొళ్ళు మండింది. అతనెప్పుడూ యింతే! ఫస్టుక్లాసు కొనవయ్యా బాబూ అంటే ఏనాడూ

(తరువాయి 27 వ పేజీలో)

# వంచన

( 10 వ పేజీ తరువాయి )

విన్నది లేదు. ఇప్పుడు రాధా, రఘూ తనను చూస్తే ఏమవుతుంది? ఏమీ కాదులె అంటాడు అమృతరావు. తనకుమాత్రం చిన్నతనం అని పిస్తుంది. ఆమె తిరిగి క్రీగంట వాళ్ళవంక చూసింది. విద్యుద్దీపకాంతిలో ఆమె చిరునవ్వు వెలిగే ముఖం మనోహరంగా మెరిసిపోతోంది. ఆ క్షణాన ఆమె ఎదలో ఒక సందేహం మెరిసింది. ఇంటికిపోయేటప్పుడు అడగవచ్చులెమ్మని పూరుకుంది.

లైట్లు ఆరిపోయాయి. ఆట ప్రారంభమయింది.

సినిమా వదిలాక అమృతరావూ, శారదా రోడ్డుమీదికి వొచ్చారు. వెన్నెల అంతటా పాల నురగలా పరుచుకుంది. ఇద్దరూ కాలినడకన బయలుదేరారు. కొంతదూరం వచ్చాక శారద అన్నది హఠాత్తుగా "మీరు రాధను ఎందుకు చేసుకోలేదు?" అని. "నేను తగనుగనక" అన్నాడు నిర్లిప్తంగా. "ఆమెను చేసుకోవాలని ఏనాడయినా అనిపించిందా?" అన్నదామె తిరిగి "చూడు శారదా! కొన్నిపనులు కొందరు చేయనప్పుడు దానికి కారణం ఏమిటి అని తర్కించడం మానేస్తే ఉభయతారా మంచిదవుతుంది. నువ్వు మనసులో పెట్టుకున్న సందేహాలన్నీ నీ వూహాలు. అవి మర్చిపో"అన్నాడతను దృఢంగా. శారద తిరిగి మాట్లాడలేదు మనసులోమాత్రం "నావూహాలన్నీ నిజమే. కాకపోతే అతనలా మాట్లాడివుండడు" అనుకుంది ఆమెకు అతని మీద జాలికలిగింది అతను అమాయకుడేకాదు, భయస్తుడుకూడా అనుకుంది.

వారంరోజులు గడిచాయి

ఆరోజు సాయంత్రం ఆఫీసునుంచి బయటకు వచ్చిన అమృతరావు అప్పుడే అక్కడ రిక్షా దిగిన నాయుడుగార్ని చూసి "ఏదో విశేషముంది" అనుకున్నాడు. ఆయన ఇతన్ని చూడంగానే "మీమేనేజింగ్ డైరెక్టర్‌తో మాట్లాడానయ్యా! ఆ పోస్టు నీకే యిస్తానన్నాడు. పాతాయననే వుండమని అడిగాడుట, 'వయసయిపోయింది మా వూరుపోయి కృష్ణా రామా అనుకుంటానన్నాట్ట. కాబట్టి మరో వారం రోజుల్నుంచీ నువ్వు హెడ్ ఎకౌంటెంటన్నమాట. పద! పోయి రఘుతోటి రాధతోటి చెప్పివొద్దాం' అన్నారు గబగబా. అమృతరావు "పదండి" అన్నాడు మరోమాటలేకుండా. ఇద్దరూ రిక్షాలో వాళ్ళింటికి చేరుకున్నారు. లోపలకు వెళ్ళేసరికి రఘూ రాధా చెరో కుర్చీలోనూ కూచుని దిగాలుగా కనిపించారు. నాయుడుగారు అదేమీ పట్టించుకోకుండా "అమృతానికి ప్రమోషనయింది రఘూ! ఆ సందర్భంలో రేపు చిన్న పార్టీ యిస్తున్నాం. మీరిద్దరూ తప్పకుండారావాలి" అన్నారు. రఘు చిన్నగానవ్వి "కంగ్రాచ్యులేషన్స్ అమృతరావుగారూ... వొస్తాలెండి. ఆదివారమేగా?" అన్నాడు. ఆదంపతులతీరులో ఏదో విషాదం గోచరించింది అమృతరావుకి "అలావున్నారేం?" అని అతడు అడగబోయేటంతలోనే "వొస్తాం రఘూ! రాధా! నువ్వు కూడా తప్పకుండారావాలి. రాకపోతే నామీద వొట్టు" అన్నాడు నాయుడుగారు. "అలాగే వొస్తాం" అన్నది రాధ లేనినవ్వుతెచ్చుకుని. నాయుడుగారు "వెళ్లొస్తాం" అనిచెప్పి అమృతరావును తీసుకుని బయటకువచ్చాడు.

ఇంటికి వచ్చాక శారద అన్నది "రఘుగారికి ఎస్టాబ్లిష్‌మెంట్ నోటీసు వచ్చిందిటగా?" అని. అమృతరావు తెల్లబోయి "నీకెలా తెలిసింది?" అన్నాడు. "మధ్యాహ్నం నాన్నగారు అంటున్నారు" అన్నది శారద. అతనికిదంతా అయోమయంగా కనబడింది. ఆయనకుతెలిసే నిర్లిప్తంగా వూరుకున్నారా? ఎందుకని? అతనికి దీనంగా వున్న రాధ ముఖం గుర్తుకొచ్చింది నాలుగయిదు నిముషాలు కూచుని, వెళ్లిపోతూ అన్నది జనాంతికంగా మంద్రస్వరంతో: "మోసాలు అందరూ చేస్తారు కాబోలు" అని.

అమృతరావు దిగ్భ్రాంతుడై ఆమెవంక చూస్తూ వుండిపోయాడు.

* * * *

మరునాడు సాయంకాలం నాలుగున్నర వేళ తెగని ఆలోచనల్తో సతమతమవుతూ బాల్కనీలో నుంచున్నాడు అమృతరావు. అతని మనసులో మాట మాటికీ రాత్రి శారద అన్నమాట మారుమోగసాగింది. ఆమె భావం అతన్ని ఒళ్ళంతా కంపింపజేస్తోంది. అది నిజంకాదు అని ఎంత నమ్మించుకుందామన్న అది అసాధ్యమే కాసాగింది అతను ఇబ్బందిగా బాల్కనీ అంచుని రెండు చేతుల్తో వొత్తాడు. లోపల హాల్లోంచి నాయుడుగారి మాటలు వినిపిస్తున్నాయి. వెళ్దామనుకుని వెనక్కుతిరిగి గుమ్మం ఎక్కిన గోడనానుకుని నిలబడ్డ రాధను చూసి ఆశ్చర్యంతో ఆగిపోయాడు. ఆమె నయనాలు వర్షించబోయే మేఘాల్లా నిండుగావున్నాయి. అతను నిలువెల్లా కదిలిపోయాడు "రాధా" అన్నాడు డగ్గుత్తికతో.

ఆమె తటాలునవొచ్చి అతని ఎదురుగా కొంగుపట్టింది దుఃఖంతో పూడుకుపోయిన కంఠాన్ని బలవంతాన చీల్చుకుని "సిగ్గులేనిదాన్ని కనికరించుబావా!" అన్నది. ఆమాట నోటి నుంచి వెలువడిన క్షణాన్న ఆమె కన్నీరు ధారగా కారిపోయింది. అమృతరావు కన్నీరు దాచుకుందుకు ముఖం పక్కకు తిప్పుకున్నాడు. కొద్ది క్షణాలకు తనను తాను సంభాళించుకుని, ఆమె భుజంమీద చేయివేసి "పద రాధా!" అన్నాడు నిండుగా. ఆమె నిశ్వసించింది మనసారా.

ఇద్దరూ లోపలకు వచ్చారు. కూచున్నాక ఫలహారాలు తీసుకోబోతుండగా నాయుడుగారు లేచి "ఒక ముఖ్య ప్రకటన" అన్నారు. అంతా బల్లమీదికివొంగి ఆతృతగా ఆయనవంక చూశారు. "కొద్దిరోజుల్లో అమాయకుడూ, పిచ్చివాడూ అయిన వొక యువకుడికీ రాలుగాయి అయిన ఓఅమ్మాయికీ వివాహం జరగబోతుంది. మీరంతా దానికి తప్పకుండారావాలి" అన్నారు. అందరికీ ఆవెతాళప్రశ్నకు సమాధానం మరుక్షణానే అర్థమయింది. అమృతరావుమాత్రం "ఆ పిచ్చివాడికి కొన్నికోరికలున్నాయట అవి ఎవరు తీరుస్తారు?" అన్నాడు. "ఇంకెవరు? మావంగారే! అయినా ఏమిటో అంతటి గొంతెమ్మ కోరికలు?" అన్నారాయన. "ఆపిచ్చివాడికి ఓ ముద్దుల మరదలు వుంది. ఆమె స్వామికి వొక అతిముఖ్యమయిన సహాయం చెయ్యాలి" అని.

నాయుడుగారి ముఖం క్షణం గంభీరమయింది. ఆ గంభీరముద్రవెనుక ఎన్ని ఆలోచనలు సుళ్ళు తిరిగాయోగాని, "అంతకన్నానా? తప్పదుగా?" అన్నాడు గంభీరంగానే. ఆ మాటతో రాధ రఘువంక చూసింది. అతనికి అంతా అర్థమవగా తలదించుకున్నాడు ఏదో ఆలోచిస్తూ.

---

*

## ఉగాది సంచిక

1—4—62 తేదీగల "చుక్కాని" ఉగాది ప్రత్యేక సంచికగా వెలువడుతుంది. అదనపు శీర్షికలు, ఆకర్షణలు గల ఈ ప్రత్యేక సంచికకై త్వరపడండి వెల 0-20 న.పై మాత్రమే.

*